అధ్యక్షా..



చిత్తూరు అభివృద్ధికి ప్రత్యేక నిధులు కావాలి



చిత్తూరు నగర అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి.చిత్తూరు మున్సిపాలిటీ స్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయికి ఎదిగినా ఆ స్థాయిలో అభివృద్ధి చెందలేదు. నగరంలో వంద సంవత్సరాలు దాటిన వంతెనలు లిల్లీ బ్రిడ్జి, మహావీర్ బ్రిడ్జి స్థానంలో కొత్తవి నిర్మించాల్సిన అవసరం వుంది.బ్రిటీష్ కాలంలో నిర్మించిన భవనాల్లోనే ఇంకా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు పనిచేస్తున్నాయి.ఆ భవనాల స్థానంలో కొత్తవి నిర్మించాలి. అంతేకాకుండా నగరంలో నీటి సమస్య, డ్రైనేజీ నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు తదితర అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి.

- జగన్మోహన్, చిత్తూరు

నీవానది ఏటిపై వంతెన నిర్మించాలి



మాది రూరల్ ఏరియా కాబట్టి కరెంటు కొరత ఎక్కువగా ఉంటుంది.వైసీపీ హయాంలో రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్లు బాలగంగనపల్లికి, గాజంకికి మంజూరైనా. ఏర్పాటు చేయనేలేదు.వీటిని వెంటనే మంజూరు చేయాలి. అలాగే కొండేపల్లి, పుల్లూరు, లంకిపల్లి ప్రాంతాలకు కూడా సబ్‌స్టేషన్లు మంజూరు చేయాలి. పెనుమూరు నుంచి నేంద్రగుంట వెళ్లే రోడ్డు చాలా దారుణంగా వుంది.వెంటనే మరమ్మతులు చేయకపోతే ప్రమాదాలు జరిగే అవకాశముంది.చిత్తూరు రూరల్ మండలం నరసింగ రాయనిపేట నుంచి జీడీనెల్లూరు మండలం ఆత్మకూరు మార్గమధ్యంలో నీవానది ఏటిపై వంతెన నిర్మించాలి.వర్షాలు పడినప్పుడు ఆత్మకూరు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు నరసింగరాయనిపేట వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారు.వెంటనే దీన్ని శాంక్షన్ చేయాలని కోరుతున్నా.

- వీఎం థామస్, గంగాధర నెల్లూరు

'ఓపెన్' పరీక్షలు!

- బుక్‌లెట్లు, బిట్ పేపర్లతో పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులు
- జీడీ నెల్లూరు, పుంగనూరు కేంద్రాల్లో నకిలీ విద్యార్థులు





చిత్తూరు గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాల కేంద్రం వద్ద విద్యార్థులు - బిట్ పేపరు తీసుకెళుతున్న విద్యార్థి

చిత్తూరు సెంట్రల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రతిసారిలాగే ఈ ఏడాది కూడా ఓపెన్ స్కూల్ పరీక్షల్లో భారీ అవకతవకలు జరిగాయన్న విమర్శలొచ్చాయి. బుక్‌లెట్లు, బిట్ పేపర్లను పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులు తీసుకెళ్లడం కనిపించింది. పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో బిట్ల వ్యవహారం బయటకు పడింది. దీన్నిబట్టే విద్యాశాఖ సిబ్బంది తనిఖీలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కొన్ని చోట్ల మాస్ కాపీయింగ్ కూడా జరిగిందన్న ఆరోపణలున్నాయి. స్టడీ సెంటర్ల నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు.. బుక్‌లెట్లు, పుస్తకాలను అందించేందుకు సహకరించారన్న విమర్శలూ వస్తున్నాయి. ఇవన్నీ ఇలా ఉంటే.. విద్యార్థుల నుంచి కూడా స్టడీ సెంటర్ల నిర్వాహకులు భారీ మొత్తంలో నగదు వసూలు చేసినట్లు సమాచారం.

పరీక్షలు జరిగే చోట మధ్యాహ్నం బడి

ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు జరుగుతున్న 15 ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం ఐదు గంటల బడి నిర్వహించాలని డీఈవో ఒక ప్రకటనలో తెలిపారు. సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలన్నారు. ఫార్మేటివ్ అసెస్మెంట్-4 పరీక్షలను సమీప పాఠశాలలో నిర్వహించాలన్నారు. ఇదిలా ఉండగా టెన్త్ విద్యార్థులకు ప్రీపబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి మొదలయ్యాయి.

477 మంది గైర్హాజరు

తొలి రోజున 2894 మంది విద్యార్థులకు 2415 మంది హాజరవగా, 477 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు.

పట్టుబడ్డ ఇద్దరు నకిలీ విద్యార్థులు

తొలి రోజే ఇద్దరు నకిలీ విద్యార్థులను అధికారులు పట్టుకున్నారు. గంగాధరనెల్లూరు మండలం శ్రీవిశ్వేశ్వర జూనియర్ కళాశాలల స్టడీ సర్కిల్‌లోని పి.జయకుమార్ అనే విద్యార్థికి బదులు మరో వ్యక్తి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో పట్టుబడ్డాడు. అలాగే చౌడేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పంజాణి వంశీకృష్ణ అనే విద్యార్థికి బదులు మరో వ్యక్తి పుంగనూరు జడ్పీ ఉన్నత పాఠశాల (బాలికల) పరీక్ష కేంద్రంలో పట్టుబడ్డారు. వీరిద్దరినీ అధికారులు పోలీసులకు అప్పగించగా, కేసు నమోదు చేశారు. కాగా. ఈ ఇద్దరి విద్యార్థులపై చర్యలు తీసుకోనున్నట్లు డీఈవో వరలక్ష్మి, పరీక్షల సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

పుష్పపల్లకిలో విహరించిన పార్వతీపరమేశ్వరులు





కోలాట బృందం, డ్రమ్స్ విన్యాసాలు - ప్రత్యేక అలంకరణలో కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి

బంగారుపాళ్యం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యంమండలంలోని మొగిలిలో వెలిసిన కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి వార్షిక ఉత్సవాల్లో తొమ్మిదవ రోజైన సోమవారం ఆదిదంపతులైన పార్వతీపరమేశ్వరులు పుష్పపల్లకిలో భక్తులను అనుగ్రహించారు.ఉదయం మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగాధర గురుకుల్ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు ఆలయంలోని అలంకార మండపంలో స్వామి,అమ్మవారి ఉత్సవర్లను స్వర్ణాభరణాలతో అలంకరించారు. అనంతరం ఉత్సవర్లను మేళతాళాలు, అర్చకుల వేదమంత్రాల నడుమ పుష్పపల్లకిలో అధిష్ఠింపజేసి మాడవీధుల్లో ఊరేగించారు. బొమ్మాయిపల్లెకు చెందిన మమత,ఆర్ఎం ఈశ్వరనాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు.బొమ్మాయిపల్లెకే చెందిన కోలాట బృందం, కర్ణాటక నుంచి రప్పించిన డ్రమ్ కళాకారుల విన్యాసాలు భక్తులను అలరించాయి.ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంటీ విజయకుమార్,ఈవో మునిరాజ తదితరులు పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాల్లో నేటి ఉదయం సూర్యప్రభ వాహన సేవ, సాయంత్రం వసంతోత్సవం, త్రిశూలస్నానం,ధ్వజావరోహణం కార్యక్రమాలుంటాయి.



పుష్పపల్లకి వాహనం ముందు ఉభయదారులు

టెన్త్ విద్యార్థులకు హాల్ టికెట్ల విడుదల

చిత్తూరు సెంట్రల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు హాల్ టికెట్లు విడుదల చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి పరీక్షలు రాసే విద్యార్థులు తమ హాల్ టికెట్లను వాట్సాప్‌లోని మనమిత్ర ద్వారా డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం 95523 00009 నెంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని సందేశాన్ని పంపాలి. ఆపై సర్వీసు, సేవను ఎంపిక చేసుకోవాలి. చైల్డ్ ఐడీ, పుట్టిన తేదీ నమోదు చేస్తే మీ వాట్సాప్ నెంబరుకు పీడీఎఫ్ ఫార్మేట్‌లో వచ్చే హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని, ప్రింట్ తీసుకోవచ్చని వివరించారు.

స్తంభించిన డీసీసీబీ సేవలు

- కంప్యూటరీకరణ పేరిట దాటవేత
- ఎల్టీ రుణవితరణ లక్ష్యం రూ.300 కోట్లు.. ఇచ్చింది రూ.8 కోట్లే
- కౌలు రైతులకు పైసా విదల్చని బ్యాంకు



డీసీసీబీ ప్రధాన కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు 'సహకారం' అందించాల్సిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో కార్యకలాపాలు స్తంభించిపోయాయి.ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని సింగిల్ విండోల్లో సీఈవోలు, సిబ్బంది కంప్యూటరైజేషన్‌పై దృష్టిపెట్టి, రుణాల పంపిణీని నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో స్థానిక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కాగా బ్యాంకు బ్రాంచ్‌ల్లో అంతో ఇంతో రుణాలిస్తున్నా బకాయిల వసూలు అంతంతమాత్రంగానే వుంది. ఫలితంగా నిరర్థక ఆస్తులు రూ.వంద కోట్లకుపైగా పేరుకుపోయాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.940 కోట్లు స్వల్పకాలిక, దీర్ఘకాలిక, కౌలురైతులకు రుణాలివ్వాలని లక్ష్యం కాగా, ఫిబ్రవరి చివరినాటికి రూ.528 కోట్లు మాత్రమే పంపిణీ చేశారు. మార్చినెలాఖరు నాటికి మిగిలిన రూ. 412కోట్లు పంపిణీ సాధ్యమా...? 40 శాతానికి పైగా రికవరీ వున్న సంఘాలకే దీర్ఘకాలిక రుణాల కేటాయింపులు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.3500 కోట్ల టర్నోవర్ అధిగమించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

● డిపాజిట్ల లక్ష్యం నెరవేరేనా?

ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రూ.1100 కోట్లు డిపాజిట్లు సేకరించాలన్నది లక్ష్యం. ఫిబ్రవరి చివరినాటికి రూ.940 కోట్ల మేర సేకరించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఈ నెలాఖరులోగా మిగిలిన రూ.160 కోట్లు సేకరించాల్సి వుంది.



డీసీసీబీ గిరింపేట బ్రాంచ్ వద్ద ఏర్పాటుచేసిన ఎన్పీఏ రికవరీ బ్యానర్

వివరాలు ఇలా....	
డీసీసీ బ్యాంకు బ్రాంచ్‌లు	: 37
సింగిల్ విండోలు	: 75
ఎల్టీ రుణ లక్ష్యం	: రూ.300 కోట్లు
180 మందికి ఇచ్చింది	: రూ.8 కోట్లు
ఎస్టీ రుణలక్ష్యం	: రూ.600 కోట్లు
64వేలమందికి ఇచ్చింది	రూ.520 కోట్లు
కౌలు రైతులకు రుణలక్ష్యం	: రూ.40 కోట్లు
పంపిణీ చేసింది	: నిల్
మొత్తం రుణాల పంపిణీ లక్ష్యం	: రూ.940 కోట్లు
గత నెల వరకు ఇచ్చింది	: రూ.528 కోట్లు
ఈ నెలాఖరులోగా ఇవ్వాల్సింది	: రూ.412 కోట్లు

● దీర్ఘకాలికం కొందరికే

2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 75 వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (సింగిల్ విండోలు), 37 బ్యాంకు బ్రాంచ్‌ల ద్వారా దీర్ఘకాలిక రుణాలు రూ.300 కోట్లు వితరణ చేయాలన్నది లక్ష్యం కాగా, 2025 ఫిబ్రవరి ఆఖరి నాటికి ఇచ్చింది 180 మంది రైతులకు అక్షరాలా రూ.8 కోట్లు మాత్రమే.

● పంటరుణాల పంపిణీ మెరుగే

ఖరీఫ్,రబీసీజన్లకు సంబంధించి సన్నచిన్నకారు రైతులకు సహకార బ్యాంకుద్వారా రూ.600కోట్లు పంపిణీ చేయాల్సి వుండగా బ్యాంకు అధికారులు రూ.520కోట్లు పంపిణీచేసి శభాష్ అనిపించుకున్నారు.

● కౌలుదారులకు గుండుసున్న

సాగు ధ్రువీకరణ హక్కు పత్రాలు (సీసీఆర్సీ) కలిగిన కౌలు రైతులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా పంట రుణాలు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ మేరకు కౌలురైతులు సీసీఆర్సీ పత్రాలు కూడా పంపిణీ చేశారు. ప్రస్తుత ఏడాది 40 కోట్ల రూపాయల దాకా కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని డీసీసీబీ లక్ష్యం పెట్టుకుంది.అయితే ఇప్పటివరకూ ఒక్క పైసా కూడా ఇవ్వకపోవడం విడ్డూరం.

● బకాయిల వసూలు కష్టమే!

ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్రబ్యాంకు పరిధిలో 75 సింగిల్ విండోల కంప్యూటరీకరణ పనులు వంద రోజులుగా సాగుతూ.. వున్నాయి. అసలు ఎంతమందికి రుణాలిచ్చారో అన్న వివరాలతో పాటు అప్పుల వివరాలు, డిపాజిట్లు, మూలధనం చెల్లించినవారు.. తదితర వివరాలన్నిటినీ.. కంప్యూటరీకరిస్తున్నారు. గత ఏడాది అక్టోబరు 2 నాటికి ఈ ప్రక్రియను పూర్తిచేస్తామని నేటికీ నత్తనడకన సాగుతుండడం గమనార్హం. కంప్యూటరీకరణ పేరుతో బ్యాంకుల్లో, సింగిల్ విండోల్లో కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి.పనిచేయాల్సిన సీఈవోలు, సిబ్బంది కంప్యూటరీకరణ ప్రక్రియలో మునిగిపోవడంతో రుణాల పంపిణీ కార్యకలాపాలు పూర్తిగా ఆగిపోయాయి. రూ.103 కోట్ల వరకు వున్న పారుబాకీలను 65 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మార్చి ఆఖరుకు రూ.40 కోట్లు వసూలు చేయాలని బ్యాంకు అధికారులు లక్ష్యం నిర్ణయించారు. గత మూడు నెలలుగా మొండి బకాయిల వసూలు కోసం దృష్టిపెట్టాల్సిన యంత్రాంగం కంప్యూటరీకరణ ప్రక్రియపై దృష్టిమరల్చడంతో మొండిబకాయిల వసూళ్ళు ఆగిపోయాయి. ఫిబ్రవరి, మార్చినెలల్లో మొండిబకాయిల వసూళ్ళకు బ్యాంకు అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బ్యాంకుల వద్ద ఎన్పీఏ రికవరి డ్రైవ్ పేరిట బ్యానర్లు కట్టి అధికారులు మొండిబకాయిలు వసూలు చేపట్టారు.అయినా పెద్దగా ఫలితం లేదు.

ప్రైవేటు ఫైనాన్సు సంస్థలో రూ.కోట్ల స్వాహా

పలమనేరు,మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని ఓ ప్రైవేటు ఫైనాన్సు సంస్థలో కోట్లాది రూపాయల మోసం జరిగినట్లు సంస్థ యాజమాన్యం గుర్తించింది. కొద్దిరోజుల క్రితం జరిగిన ఆడిట్‌లో నకిలీ బంగారం కుదువ పెట్టి భారీగా సొమ్ము స్వాహా చేసినట్లు గుర్తించారు.పుంగనూరు, మదనపల్లె,పీలేరు ప్రాంతాల్లో కూడా ఈ సంస్థకు శాఖలున్నాయి.అనంతపురం జిల్లాలోని ఉరవకొండలో కూడా ఈ సంస్థ సిబ్బంది ఇదేవిధమైన గోల్‌మాల్ చేయడంపై అక్కడి పోలీసులు ఒకరిని అరెస్టు కూడా చేసినట్లు తెలిసింది. సోమవారం సదరు సంస్థ యాజమాన్య ప్రతినిధులు పలమనేరుకు వచ్చి జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ విషయమై సీఐ నరసింహరాజును వివరణ కోరగా ఫైనాన్స్‌లో బంగారం కుదువ పెట్టి తీసుకున్న రుణం చెల్లించినప్పటికీ ఆభరణాలు తిరిగివ్వడం లేదని ఓ బాధితుడు తమదృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. దీనిపై తాము ఆ ఫైనాన్స్ సంస్థ సిబ్బందిని విచారించగా తాము తాకట్టు పెట్టుకొన్న బంగారాన్ని హెడ్ ఆఫీస్‌లో భద్రపరిచామని చెప్పారని, త్వరలోనే ఆభరణాలను తెప్పించి కుదువపెట్టిన వ్యక్తికి ఇవ్వనున్నట్లు చెప్పారన్నారు.

టీచర్ల సీనియారిటీపై అభ్యంతరాల స్వీకరణ

చిత్తూరు సెంట్రల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పనిచేసే హెచ్ఎంలు, టీచర్ల సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు.టీఐఎస్ ఆధారంగా రూపొందించిన జాబితాను డీఈవో వెబ్‌సైట్, నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలను డీడీవో సంతకంతో ఈనెల పదో తేదీలోపు మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఏడు గంటల మధ్య సమర్పించాలన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం) : 6.24

సహరి (బుధవారం) : 5.08

న్యాయం చేయండి

● కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో జరిగిన 'పీజీఆర్ఎస్'లో బాధితుల మొర



బాధితుడితో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అర్జీదారులు బారులు తీరారు. తమకు న్యాయం చేయండంటూ వినతులను సమర్పించారు. కలెక్టరేట్‌లో అర్జీలను కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టరు హిమవంశీ, సబ్ కలెక్టర్లు విజయలక్ష్మి, అనుపమ స్వీకరించారు. ఎస్పీ కార్యాలయంలో బాధితుల నుంచి అర్జీలను ఎస్పీ మణికంఠ స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బాధితులకు అధికారులు హామీ ఇచ్చారు.

కలెక్టరేట్‌కు 206 అర్జీలు

కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు 206 అర్జీలు అందాయి. శాఖలవారీగా.. రెవెన్యూకు 154, డీఆర్‌డీఏకు 22, పోలీసుకు 5, విద్యాశాఖకు 5, డీసీహెచ్ఎస్, ఎంప్లాయిమెంట్, ఇరిగేషన్, గృహనిర్మాణ సంస్థ, ఆర్అండ్‌బీ తదితర శాఖలకు 20 అర్జీల చొప్పున ఉన్నాయి.

ఎస్పీ కార్యాలయాలనికి 46 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 46 అర్జీలు అందాయి. వీటిల్లో.. భూ తగాదాలపై 12, భర్త వేధింపులపై 8, కుటుంబ తగాదాలపై 6, డబ్బు తగాదాలపై 6, చీటింగ్‌పై 3, చిన్నపాటి గొడవలపై 3, దారి సమస్యలపై 2, ఆస్తి తగాదాలపై 2 చొప్పున అర్జీలు ఉన్నాయి.

ప్రధాన అర్జీలిలా..

● చిత్తూరు మండలం తాళంబేడు రెవెన్యూ దాఖలా సర్వే నెంబరు 573లో సుమారు 10.23 ఎకరాల డీకేటీ భూమి ఉందని గుడిపాల మండలం మొగరాలపల్లె ఎస్టీ కాలనీ యానాదులు తెలిపారు. ఇందులో 40 ఏళ్లుగా పది కుటుంబాల వారం వ్యవసాయం చేసుకుంటున్నామని చెప్పారు. ఇందులో చిత్తూరు మండలానికి చెందిన నలుగురికి 2024లో పట్టాలిచ్చారని, గుడిపాల మండలానికి చెందిన ఆరుగురికి ఇవ్వలేదన్నారు. ఉన్నతాధికారులు విచారించి పట్టాలిప్పించాలని కోరారు.

● కుటుంబ అవసరాలకు సర్వే నెంబరు 386-1లో 0.40 సెంట్ల భూమిని రూ.3లక్షలకు విక్రయ ఒప్పందానికి పెట్టానని బైరెడ్డిపల్లె మండలం బీమిగానిపల్లె పంచాయతీలోని రామ్‌పల్లెకు చెందిన రెడ్డెప్ప తెలిపారు. ప్రస్తుతం ఆ డబ్బును ఇచ్చేస్తానని, భూమిని అడిగితే ఇవ్వడం లేదని, విచారించి న్యాయం చేయాలని కోరాడు.

● పనులు చేయకుండానే నిధులను స్వాహా చేసిన సర్పంచ్, సంబంధిత అధికారులపై విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని బంగారుపాళ్యం మండలం గుండ్లకట్టమంచి పంచాయతీ ప్రజలు కోరారు. మూడేళ్లుగా ఎలాంటి పారిశుధ్య పనులు చేయకుండానే సర్పంచ్ తన భార్య పేరుతో ఎలాంటి బిల్లులు, ఎం.బుక్ లేకుండానే రూ.10లక్షలు, గ్రీన్ అంబాసిడర్లకు ఇవ్వాల్సిన రూ.2లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8లక్షలకు సంబంధించి ఎలాంటి పనులు చేయకుండానే తప్పుడు బిల్లులు సృష్టించి తినేశాడని ఆరోపించారు. ఆర్టీఐ కింద తాము వివరాలను సేకరించామని, విచారించి నిధులను రికవరీ చేసి.. సంబంధిత అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

● మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లింపును ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వొద్దని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రామచంద్రయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, గౌరవాధ్యక్షుడు నాగరాజన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపుతో కలెక్టరేట్ వద్ద కార్మికులతో కలిసి ధర్నా చేశారు. అర్హులైన అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు ఎన్‌క్యాష్‌మెంట్, మూడు డీఏలను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

● సర్వే నెంబరు 331-11లో 2.18 ఎకరాల భూమి తమ అనుభవంలో ఉందని చౌడేపల్లె మండలం కాగతి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ తెలిపారు. ఎకరం నాలుగు సెంట్లకు పట్టా ఉందని, మిగిలిన భూమిని కలుపుకుని 14 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నామన్నారు. ఇటీవల పక్కపొలానికి చెందిన వ్యక్తి మిగిలిన భూమిని కాజేయడానికి ప్రయత్నిస్తున్నాడని చెప్పారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

● తమ కాలనీలో పరిశుభ్ర వాతావరణం ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని చిత్తూరు నగరం మురుగానిపల్లె సమీపంలో మైదా ఫ్యాక్టరీ వద్ద నివాసాలుంటున్న మహిళలు కోరారు. తమ కాలనీకి సమీపంలో వివేకానంద కాలేజీ ఉందన్నారు. ఆ కళాశాల విద్యార్థులు కాలనీలో వ్యర్థాలను పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.







కలెక్టరేట్‌కు వచ్చిన మైదా ఫ్యాక్టరీ వద్ద నివాసాలున్న మహిళలు, ధర్నా చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, బాధితుల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ మణికంఠ

పెండింగ్‌లోని అర్జీలను 15లోగా పరిష్కరించండి : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులు, స్పందన కార్యక్రమాల ద్వారా అందిన అర్జీల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని ఈనెల 15వ తేదీలోగా పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్‌హాలు నుంచి జేసీ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీలతో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీసర్వేపై అందిన అర్జీలను తహసీల్దార్లు పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. సంబంధిత ఆర్డీవోలు తమ పరిధిలోని మండలాల్లో పర్యటించి రీఓపెన్‌కు అవకాశం లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. వెబ్‌ల్యాండ్‌కు సంబంధించి సమస్యలను నెలాఖరులోగా డిప్యూటీ సర్వేయర్లు పరిష్కరించేలా ఆర్డీవోలు ఆదేశాలు జారీచేయాలన్నారు. వెబ్‌ల్యాండ్ పెండింగ్ ఫైల్స్‌పై ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీటీలు, డీఐలు, మండల సర్వేయర్లకు పలు సూచనలిచ్చారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

చిత్తూరు సెంట్రల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ సెకండియర్ పబ్లిక్ పరీక్షల కేంద్రాలను ఎస్పీ మణికంఠ పరిశీలించారు. తరగతి గదుల్లోని సీసీ కెమెరాల పనితీరు, బందోబస్తు ఏర్పాట్లతోపాటు అధికారులతోనూ మాట్లాడారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి పటిష్ఠ భద్రత చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎస్పీవెంట ఒకటో పట్టణ సీఐ జయరామయ్య, కాలేజీ సిబ్బంది ఉన్నారు.

609 మంది విద్యార్థుల గైర్హాజరు

సెకండియర్ తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ, తమిళం లాంగ్వేజ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జనరల్, ఒకేషన్‌కు సంబంధించి 14,029 మందికిగాను 13,420 మంది హాజరవగా, 609 మంది గైర్హాజరైనట్లు డీవీఈవో సయ్యద్‌మౌల తెలిపారు. జనరల్‌లో 12,220 మందికి 11,711 మంది హాజరవగా, 509 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1809 మందికి 1709 మంది విద్యార్థులు హాజరవగా, వంద మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

సారా తయారీకి బెల్లం సరఫరా చేస్తే చర్యలు

● ఎక్సైజ్ డీసీ విజయ శేఖర్ హెచ్చరిక



బెల్లం మండి వ్యాపారులతో మాట్లాడుతున్న డీసీ విజయ శేఖర్

చిత్తూరు సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సారా తయారీకి బెల్లం సరఫరా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ డీసీ విజయ శేఖర్ హెచ్చరించారు. సోమవారం స్థానిక మండి వీధిలో బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. డీసీ మాట్లాడుతూ.. బెల్లం మండి వ్యాపారులు తమ వ్యాపార లావాదేవీలను ప్రతి 15 రోజులకొకసారి సంబంధిత ఎక్సైజ్ అధికారులకు అందజేయాలని చెప్పారు. బెల్లం మండి వ్యాపారుల యూనియన్ నేతలు మాట్లాడుతూ.. తామంతా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటామని తెలిపారు. ఎక్సైజ్, ఎన్ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి, టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, సీఐ శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీలో వి.కోట భేష్

● కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రశంస



ఈవో శివశంకర్‌ను అభినందిస్తున్న కలెక్టర్

వి.కోట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీలో వి.కోట గ్రామ పంచాయతీ మేటిగా నిలిచిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అభినందించారు. చెత్త నుంచి సంపద వచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వం చేస్తున్న సూచనలను ఈ పంచాయతీ సిబ్బంది క్రమం తప్పకుండా అమలు చేస్తున్నారు. ఫలితంగా వర్మీ కంపోస్టు ద్వారా పంచాయతీకి మూడు నెలలకు రూ.లక్ష మేర ఆదాయం లభిస్తోంది. సోమవారం పంచాయతీ ఈవో శివశంకర్ చిత్తూరు వెళ్లి కలెక్టర్‌ను కలిసి చెత్త సంపదకు తాము చేస్తున్న కృషిని వివరించారు. ప్లాస్టిక్ కవర్లను వినియోగించకుండా వస్త్రాల బ్యాగుల్లో ఎరువులను నింపి విక్రయిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ స్పందిస్తూ ఇలాంటి విధానంపై కలెక్టరేట్‌లో స్టాల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే పద్ధతిని అన్ని పంచాయతీల్లో అమలు చేయాలని డీపీవోకు ఆదేశాలు జారీ చేశారు.

అమ్మ సిసింద్రీ.. ఎంతపని చేశావ్!

●మున్సిపల్ ట్రాక్టర్‌తో ఉడాయింపు ●బొలేరును ఢీకొనడంతో ముగ్గురికి గాయాలు



బొలేరో వాహనాన్ని ఢీకొన్న మున్సిపల్ ట్రాక్టర్

కుప్పం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఓ స్వీపర్ మున్సిపాలిటీ ట్రాక్టర్‌ను తీసుకుపోయి ముగ్గురు గాయపడటానికి కారణమయ్యాడు. వివరాలివి. సిసింద్రీ అనే వ్యక్తి మున్సిపల్ ట్రాక్టర్లో స్వీపర్‌గా పనిచేస్తుంటాడు. వివాదాల నేపథ్యంలో ఇతని భార్య ఇటీవల సొంతూరు వి.కోటకు వెళ్లిపోయింది. ఆదివారం రాత్రి పూటుగా మద్యం తాగిన సిసింద్రీ ఫోన్‌లో మళ్లీ భార్యతో గొడవపడ్డాడు. అదే ఆవేశంలో పూలమార్కెట్టు వద్ద ఉన్న మున్సిపల్ ట్రాక్టర్‌ను నడుపుకొంటూ వి.కోట వెళ్లాడు. ఆమె రాకపోవడంతో తిరిగి వస్తూ మొరసనపల్లె వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బొలెరో వాహనంలోని ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. విషయం తెలిసి రాళ్లబూదుగూరు పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాత్రి పూట మున్సిపల్ ట్రాక్టర్ అక్కడ ఉండటంతో వారు విస్తుపోయారు. నిందితుడు సిసింద్రీని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. దీనిపై సీఐ శంకరయ్య మాట్లాడుతూ మున్సిపల్ ట్రాక్టర్ ఎవరో అపహరించుకుపోయారని ఆదివారం రాత్రి 11 గంటలకు తమకు ఫిర్యాదు అందిందన్నారు. ఈ ప్రమాదం తర్వాత నిందితుడ్ని విచారిస్తే అసలు విషయం బయటపడిందన్నారు. గొడవపడి వెళ్లిపోయిన భార్యను తేవడానికి ట్రాక్టర్ తీసుకువెళ్లిన క్రమంలో ప్రమాదం జరిగినట్లు సిసింద్రీ చెప్పాడన్నారు. ఇతడ్ని విధుల నుంచి తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు చెప్పారు.

చికెన్, కోడిగుడ్డుపై అపోహలు వీడండి: జేసీ



చికెన్, కోడిగుడ్డును తింటున్న అధికారులు, నాయకులు

చిత్తూరు అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చికెన్, కోడిగుడ్డుపై అపోహలు వీడాలని జేసీ విద్యాధరి సూచించారు. సోమవారం స్థానిక న్యూట్రిన్ ఫ్యాక్టరీ ఆవరణంలో మెగా చికెన్ మేళాను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ.. చికెన్, కోడిగుడ్డు తింటే బర్డ్‌ఫ్లూ వస్తోందన్నది వదంతులు మాత్రమేనని చెప్పారు. 65 కిలోల మనిషికి రోజుకు 65 గ్రాముల ప్రొటీన్లు అవసరమన్నారు. ఒక గుడ్డులో 7 నుంచి 8 గ్రాముల ప్రొటీన్ ఉంటుందని, చికెన్‌లో ఆశాతం ఇంకా ఎక్కువగా ఉంటుందని చెప్పారు. కోడి నుంచి మనిషికి బర్డ్‌ఫ్లూ వ్యాపించదన్నారు. ప్రతి ఒక్కరూ చికెన్, కోడిగుడ్లను తీసుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నెక్ జాతీయ కమిటీ సమన్వయ కమిటీ సభ్యుడు రమేష్ బాబు మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధర లేక నష్టాల్లో కూరుకుపోయిన సమయంలో బాలాజీ హేచరీస్ వ్యవస్థాపకుడు సుందరనాయుడు కోళ్ల పరిశ్రమను రైతులకు అందుబాటులోకి తెచ్చారని గుర్తుకుతెచ్చారు. అనంతరం 5వేల మందికి చికెన్ కబాబ్, ఉడికించిన కోడిగుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, జీజేఎం ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, బాలాజీ హేచరీస్ డైరెక్టర్ ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏనుగుల దాడులు





అన్నెమ్మగారిపల్లె వద్ద వరి పంటను తొక్కివేసిన ఏనుగులు, ధ్వంసమైన కొబ్బరి చెట్టు

సోమల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదిరోజులుగా రైతులు కునుకు తీయడంలేదు. ఏనుగులెక్కడొచ్చి పంటను నష్టపరుస్తాయోనని పొలాల వద్దే కాపు కాస్తున్నారు. తాజాగా పేటూరు, పాతూరుపెంట, వడ్డిరామపురం, ఎర్రగుంతలపల్లె సమీపంలో ఏనుగులు సంచరించాయి. టమోటా, మామిడి, వరి పంటలను ధ్వంసం చేశాయి. బాలే నారాయణ, కృష్ణమ్మ, పాపయ్య, గంధం గోపీ, కృష్ణప్పకు చెందిన టమోటా తోటల్లో ఊత కర్రలను పెకిలించాయి. డ్రిప్ పరికరాలను కూడా తొక్కేశాయని బాధిత రైతులు తెలిపారు. టమోటా తోటలోని పీవీసీ పైపులను ధ్వంసం చేయడంతో వీరు కన్నీరు పెడుతున్నారు. తోటలకు కంచెను, రాతి కూసాలను విరిచేశాయి. ఏడాది క్రితం ఫారెస్ట్ ఉన్నతాధికారులు పత్రపల్లె ప్రాంతాన్ని సందర్శించారు. సోలార్ కంచెను ఏర్పాటు చేస్తామన్నారు. ఏనుగుల దాడుల నివారణకు బేస్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. నష్టపరిహారం పెంచుతామని హామీ ఇచ్చారు. కానీ హామీలు అమలు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల కట్టడికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

● అర్ధరాత్రి ఎక్స్‌ప్రెస్ హైవేపై ప్రమాదం
● అక్కడికక్కడే నలుగురి దుర్మరణం
● మరో నలుగురికి తీవ్ర గాయాలు





ప్రమాదంలో దెబ్బతిన్న కారు, ద్విచక్ర వాహనం

వి.కోట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు - చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేపై వి.కోటకు 20కిలోమీటర్ల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే చనిపోగా మరో నలుగురు గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం బంగారుపేట తాలూకా కుప్పనల్లి సమీపంలో లైటు లేకుండా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని ఇన్నోవా కారు ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు....కర్ణాటక రాష్ట్రం కదిరిగాని కుప్పానికి చెందిన శీనప్ప బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన కుమారుడు మహేష్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలసి చూడ్డానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా ఆదివారం అర్ధరాత్రి వారు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు మాలూరు-కేజీఎఫ్ మధ్య కుప్పనల్లి సమీపంలో ఎదురుగా లైటులేకుండా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న శ్రీనాథ్ (30), కారులో ప్రయాణిస్తున్న మహేష్ కుమార్ (52), ఆయన బంధువు కమ్మసంద్రకు చెందిన జయరామప్ప భార్య రత్నమ్మ, ఆమె కుమారుడు సంతోష్ ఏడాదిన్నర కుమార్తె ఉద్విత అక్కడికక్కడే మృతి చెందారు.వీరితో పాటు కారులో ప్రయాణిస్తున్న మహేష్ సోదరి సుజాత(48), ఆమె కుమార్తె సుష్మిత(30), మనవడు విరాట్ (4), కారు డ్రైవర్ సునీల్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కోలారు మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. 8 నెలల గర్భిణి అయిన సుష్మిత కడుపులోని పాపను కాపాడేందుకు వైద్యులు శస్త్ర చికిత్స చేసినా కాపాడలేక పోయినట్లు బంధువులు తెలిపారు. సుష్మిత పరిస్థితి విషమంగా మారడంతో ఆమెను బెంగళూరుకు తరలించి అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు.ఈ ఘటనలో కారు పూర్తిగా ధ్వంసం కాగా, కారు ఢీకొన్న తీవ్రతకు ద్విచక్ర వాహనం ముక్కలుముక్కలైంది.ఇటీవల ట్రయల్ రన్ కోసం వాహనాలను అనుమతించిన ఎక్స్‌ప్రెస్ వేలో బంగారుపేట- కేజీఎఫ్ మధ్య వాహనాలు అతివేగంగా ఒకే వైపు వస్తుండడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. బంగారుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.







మృతులు మహేష్‌కుమార్, రత్నమ్మ, చిన్నారి ఉద్విత(ఫైల్ ఫొటోలు)

ప్రజా సమస్యల పరిష్కారమే ముఖ్యం : కడా పీడీ


ప్రజల వినతులు వింటున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అధికారిక బాధ్యతల్లో ప్రజా సమస్యల పరిష్కారం అత్యంత ముఖ్యమైనదని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. మండల సచివాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట దాకా అర్జీలు స్వీకరించారు. సమస్యలు సావధానంగా విని, సంబంధిత శాఖల అధికారులకు ఆయా అర్జీలు ఇచ్చి, పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ అర్జీలు పరిష్కరించేందుకు అధికారులు రోజూ కనీసం అర్ధగంట సమయం కేటాయించాలన్నారు. ఏయే సమస్యలు పరిష్కారమయ్యాయి, ఏవి పెండింగులో ఉన్నాయో జాబితా తయారు చేసుకోవాన్నారు. పరిష్కారం కాకపోతే కారణాలను నివేదించాలని చెప్పారు.. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత



కల్లూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇన్‌చార్జి తహశీల్దార్ జయసింహ, ఎంఈవోలు శిద్ధరామయ్య, పోకల తాతయ్యలు ఆకాంక్షించారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సోమవారం పులిచెర్లకు చెందిన దాత దిలీప్ విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు మొబైళ్లు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. టెన్త్ పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



సోమల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆవులపల్లెలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయిరు. టీటీడీ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. బుధవారం అంకురార్పణ, 6న ధ్వజారోహణం, సూర్యప్రభ వాహనం, 7న హనుమంత వాహనం, 8న సింహవాహనం, 9న శేషవాహనం, 10న మోహిని ఉత్సవం, గజవాహనం, 11న శ్రీవారి కల్యాణం, గరుడవాహనం, 12న బ్రహ్మరథోత్సవం, 13న అశ్వవాహనం, పార్వేటోత్సవం, 14న వసంతోత్సవం, చక్రవాహనం, హంసవాహనం, 15న శయనోత్సవం నిర్వహించనున్నారు.

వినికిడి దినోత్సవ ర్యాలీ



రొంపిచెర్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) వినికిడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని ప్రాథమిక వైద్యాధికారి డాక్టరు వినయ్ కోరారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా సోమవారం ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టరు వినయ్ మాట్లాడుతూ తక్కువ సమయం కేటాయించి తక్కువ శబ్దంతో ఇయర్ ఫోన్సు వాడాలన్నారు. చెవిలో ద్రవాలు, నూనెలు, పసర్లు వంటివి వేయరాదన్నారు. పిన్నులు, సూదులు వంటి వస్తువులు చెవిలో ఎట్టి కలబెట్టరాదన్నారు. ర్యాలీలో హెచ్‌ఈ రాజేశ్వరి, పంకజాక్షి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి సామాజిక తనిఖీ గ్రామ సభలు

కుప్పం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి సామాజిక తనిఖీ గ్రామ సభలు ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకూ ఆయా పంచాయతీల సచివాలయాలలో జరుగుతాయని ఏపీవో జ్యోతి తెలిపారు. ఈనెల 5న కంగుంది, కొటాలూరు, పైపాళ్యం, మల్లానూరు, జరుగు, నాయనూరు, చందం, బ్రహ్మదేవరచేన్లు, మోట్లచేను, 7న క్రిష్ణదాసనపల్లె, ఉర్లవోబనపల్లె, 8న గరిగచీనేపల్లె, కొత్తపల్లె, పెద్దబంగారునత్తం, 9న గోనుగూరు , 10న మొహమ్మద్‌పురం, వెండుగంపల్లె, 11న మిట్టపల్లె, గుడ్లనాయనిపల్లె, నూలుకుంట, దేవరాజపురం, చెక్కునత్తం పంచాయతీల్లో సభలు జరుగుతాయన్నారు. ఈనెల 12న మండల సభను కుప్పం మండల సచివాలయంలో నిర్వహించనున్నట్లు ఏపీవో వివరించారు.

దూరాభారమైన పరీక్షాకేంద్రంతో ఇబ్బందులు


బస్ సౌకర్యం కల్పించాలని కోరుతున్న విద్యార్థులు

రొంపిచెర్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రం నుంచి ఇంటర్ పరీక్షా కేంద్రానికి వెళ్లడానికి బస్సు సౌకర్యంలేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కస్తూరిబా విద్యాలయంలో 36 మంది, ఆదర్శ పాఠశాలలో 61 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. గతంలో చిన్నగొట్టిగల్లులో పరీక్షా కేంద్రం ఉండేది. . జిల్లాల విభజనతో రొంపిచెర్ల ఇంటర్ విద్యార్థులకు పులిచెర్ల మండలం కొత్తపేటలో కేంద్రం ఏర్పాటు చేశారు. మండల కేంద్రం నుంచి ఇది సుమారు 18 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈమార్గంలో బస్సు సౌకర్యం లేదు. సొంత వాహనాల్లో, ఆటోల్లో కొందరు వెళ్తున్నారు. శనివారం తెలుగు పరీక్ష రాసి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తున్న ఆదర్శపాఠశాల ఇంటర్ విద్యార్థి భానుప్రకాష్ ఆటో ఢీకొని గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరీక్షలు పూర్తయ్యేవరకు బస్సు వసతి కల్పించాలని ఆదర్శ స్కూలు విద్యార్థులు కోరుతున్నారు.

సోలార్ ఫెన్సింగ్‌కు నూరుశాతం సబ్సిడీ ఇవ్వాలి

పలమనేరు, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకునే రైతులకు 100 శాతం సబ్సిడీ ఇవ్వాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఉమాపతి నాయుడు కోరారు. సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏనుగుల దాడుల వలన దాదాపు 90 మందికి పైగా రైతులు మృత్యువాత పడ్డారన్నారు. పంటలు, వ్యవసాయ పంపుసెట్టు, డ్రిప్‌పరికరాలు, పశువుల పాకలు, షెడ్లు నష్టపోతున్నారు. ఏనుగుల దాడుల నివారణకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసినా నిర్వహణ గాలికి వదిలేశారన్నారు. దీంతో ఈ ఫెన్సింగ్ వృథాగా మారిందన్నారు. కందకాలు సైతం కట్టడి చేయలేక పోయాయన్నారు. ఈనేపథ్యంలో రైతులు పొలాల చుట్టూ సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకునేందుకుగాను 100 శాతం సబ్సిడీ ఇస్తే ప్రయోజనముంటుందన్నారు. సీసీఎఫ్‌కు కూడా ఈమేరకు వినతిపత్రం ఇచ్చామన్నారు.

ప్రభుత్వ దృష్టికి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు


సమావేశంలో మాట్లాడుతున్న చెంగారెడ్డి

పుంగనూరు, మార్చి3(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నట్లు విశ్రాంత ఉద్యోగ సంఘ పట్టణ అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వనివారు మాన్యువల్‌గా ఇవాల్సివుందన్నారు. సమావేశంలో సంఘనాయకులు చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, కేశవరెడ్డి, రమేశ్, రవి, రెడ్డెప్ప, శంకరప్ప, ఈశ్వర్‌రెడ్డి, భరత్‌భూషన్, గంగులమ్మ, లీలావతమ్మ, రెడ్డికుమారి పాల్గొన్నారు.

డబ్బులు చెల్లించినా స్పందించని అధికారులు

పుంగనూరు రూరల్, మార్చి3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. విద్యుత్ స్తంభాలకు వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రెండేళ్లక్రితం విద్యుత్‌శాఖకు డీడీల ద్వారా కొంతమొత్తం చెల్లించామని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, జనసేన నాయకుడు చైతన్యరాయల్, బీజేపీ నాయకుడు నానబాల కుమార్‌లకు రైతులు చెప్పారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయిందన్నారు. గత ప్రభుత్వం రైతులను రోడ్డున పడేసిందన్నారు. వేసవిలో వాణిజ్య పంటల సాగుకు వీలుగా విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మాలు త్వరగా ఇప్పించాలని కోరారు.

మల్లప్పకొండ హుండీ ఆదాయం రూ.3.44 లక్షలు

గుడుపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా స్వర్ణగిరి క్షేత్రమైన మల్లప్ప మల్లేశ్వరుడి ఆలయానికి రూ.3,34150 మేర హుండీ ఆదాయం లభించింది. మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహించారు.. సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. హుండీ, అభిషేకం, ఉత్సవం, అంగళ్ల గేటు ద్వారా ఈమేరకు ఆదాయం సమకూరినట్లు. ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


జాకీర్ (ఫైల్ ఫొటో)

వి.కోట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వి.కోట-కుప్పం మార్గంలోని పొంతనపల్లె వద్ద ధన్నువరానికి చెందిన జాకీర్ (38) అనే వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఆదివారం సాయంత్రం పొలాల్లో ఓ మృతదేహం ఉందని గ్రామస్తులు గుర్తించి బేతమంగళం పోలీసులకు తెలియజేశారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ఎవరో హతమార్చి పడేసి ఉంటారని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తై ఉన్నారు.

యాచకుడి మృతదేహానికి అంత్యక్రియలు

వి.కోట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గుర్తుతెలియని ఓ యాచకుడు మృతి చెందాడు. అన్నదాన సేవా సమితికి చెందిన వేణు చేరుకుని పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చారు. సోమారం వారితో కలసి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. మృతుడి వివరాలు తెలియలేదని వేణు చెప్పారు.

విద్యార్థులకు అభినందనలు



పలమనేరు, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీకళాశాలకు గుర్తింపు తెచ్చేలా పొరుగు రాష్ట్రాల్లో నిర్వహించిన క్యాంపులకు వెళ్లివచ్చిన ఇద్దరు విద్యార్థులను సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేసులు, కళాశాల అధ్యాపకులు అభినందించారు. బీబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రూపేష్ ఎస్.వి. యూనివర్సిటీ తరపున కన్యాకుమారిలో వివేకానంద కళాశాలలో నిర్వహించిన జాతీయ సమగ్రతా శిబిరంలో పాల్గొన్నాడు. హార్టికల్చర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మానస పూణేలో నిర్వహించిన ప్రీ-రిపబ్లిక్ డే శిబిరంలో పాల్గొంది. ఈవిద్యార్థులిద్దరినీ సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్.ఆర్. వెంకటేష్‌బాబు, డాక్టర్ పి. రవీంద్రనాథ్‌రెడ్డి, సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో అగస్తీశ్వరస్వామి



పుంగనూరు రూరల్, మార్చి3(ఆంధ్రజ్యోతి): నెక్కుంది గ్రామ సమీపంలో వెలసిన అగస్తీశ్వరస్వామి సోమవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గత 10రోజులుగా స్వామి వారికి వివిధ రకాల అభిషేకాలు. అర్చనలు, హోమాలు నిర్వహించారు. ఉదయం అర్చకులు ఆలయాన్ని శుభ్రం చేసి తోరణాలు కట్టి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఉపవాసాలతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, మార్చి3(ఆంధ్రజ్యోతి): పుంగనూరు-తిరుపతి మార్గంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... పట్టణానికి చెందిన మొగిలీశ్వర్, రవిలు చౌడేపల్లె మండలం చింతమాకులపల్లెలో మేస్త్రి పని పూర్తి చేసుకుని ఇంటికి వెళుతుండగా గొల్లపల్లె సమీపంలో వెనకవైపు నుంచి వాహనం ఢీకొంది. దీంతో వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108 సిబ్బంది చేరుకుని క్షతగాత్రులను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వరసిద్ధుడి ఆలయానికి రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి రూ.50,116, గోసంరక్షణ ట్రస్టుకు రూ.50,116లను చిత్తూరుకు చెందిన దీక్షిత్ అనుదీప్ సోమవారం విరాళంగా అందించారు.

వంగ రైతు బెంగ

ధర పతనంతో నష్టపోతున్నామని ఆవేదన



పలమనేరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో వంకాయల ధరలు దారుణంగా పడిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి మార్కెట్ యార్డులో 25 కిలోల వంకాయల ధర రూ.70 నుంచి రూ.85 పలకడంతో లబోదిబోమంటున్నారు. సాధారణంగా మాఘమాసం పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కాగానే వంకాయ ధరలు బాగా పెరుగుతాయి. ఇందుకు భిన్నంగా ఈసారి నష్టాలను చవిచూడాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే మూడు నెలలుగా టమోటా ధరలు పతనమై రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు వంకాయ సాగు చేసినా నష్టాలను నెత్తికెత్తుకోవల్సి వస్తోంది. పలమనేరు సమీపంలో కుబేరా అనే రైతు ఎకరా పొలం కౌలుకు తీసుకుని వంకాయలు సాగు చేశాడు. సుమారు రూ.70 వేలు పెట్టుబడి పెట్టినట్లు రైతు చెప్పాడు. మార్కెట్‌కు తీసుకెళితే 25 కిలోల బస్తా రూ.70 పలికింది. చెన్నై మార్కెట్‌కు పంపితే కొంతమిగిలినా రవాణా ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయంటున్నాడు. కుబేరాదే కాదు చాలామంది రైతుల వేదన ఇలాగే ఉంది.

వినికిడి లోపం రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

బైరెడ్డిపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వినికిడి లోపం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం తీర్థం గ్రామంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్య అధికారి కాంతమ్మ మాట్లాడుతూ మితిమీరిన శబ్దాలకు దూరంగా ఉండాలన్నారు. చెవులను శుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ : ఐదుగురికి గాయాలు

పుంగనూరు రూరల్, మార్చి3(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల ఘర్షణలో పలువురు గాయపడ్డారు. వివరాలిలా..చౌడేపల్లె మండలం కేతనపల్లెకు చెందిన రాజేంద్ర ప్రవర్తనపై భాగ్యమ్మ అనే మహిళ ఇటీవల గ్రామపెద్దలకు ఫిర్యాదుచేసింది. దీంతో వారు పంచాయతీ నిర్వహించి రాజేంద్రను మందలించారు. రాజేంద్ర బంధువులైన గాండ్లపల్లెవాసులు వెంకటాచలపతి, శ్రీనివాసులు ఈ పంచాయతీకి వచ్చారు. బయటవారు రావద్దని గ్రామస్తులు చెప్పడంతో వారిద్దరూ వెళ్లిపోయారు. ఈ క్రమంలో సోమవారం భాగ్యమ్మ బంధువు బాలసుబ్రహ్మణ్యం చారాలకు వెళుతుండగా వెంకటాచలపతి, శ్రీనివాసులు దాడి చేసి గాయపరిచారు. దీంతో ఇరువర్గాలూ ఘర్షణ పడ్డారు. గంగులమ్మ, ఆమె భర్తహరీష్‌లు తీవ్రంగా, శ్రీనివాసులు, వెంకటాచలపతిలు స్వల్పంగా గాయపడ్డారు. వీరంతా పుంగనూరులో చికిత్స పొందుతున్నారు.

సారా తయారీకి స్వస్తి పలికితే పథకాల లబ్ధి

● ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్



మాట్లాడుతున్న ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

పుంగనూరు రూరల్, మార్చి3(ఆంధ్రజ్యోతి): గిరిజన కులస్తులు నాటు సారా తయారీకి దూరమైతే ప్రభుత్వ రాయితీ పథకాలు పూర్తి స్థాయిలో అందించడానికి తమవంతు కృషి చేయగలమని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ తెలిపారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవోదయ 2.0పై పెద్దతాండా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా వల్ల కలిగే నష్టాలను వివరించారు. దీనిని తాగడం వల్ల ప్రాణాలు కోల్పోవడంతో పాటు రోగాలు వ్యాప్తి చెంది కుటుంబాలు ఇబ్బందులు పడాలన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమకు జీవనోపాధి కల్పిస్తే సారా తయారీని నిలిపివేస్తామన్నారు. సమావేశంలో ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్లు శ్రీనివాస ఆచారి, సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఈ శ్రీనివాసులు, సీఐ సురేష్‌రెడ్డి, సిబ్బంది. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే తగిన మూల్యం చెల్లించాలి :టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, మార్చి3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తే పత్రికలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని పుంగనూరు టీడీపీ నాయకులు హెచ్చరించారు. సోమవారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నీరు ప్రవహించని కాల్వకు తప్పుడు బిల్లులు చెల్లిస్తున్నట్లు వైసీపీ పత్రిక కథనాలు రాయడం సిగ్గుచేటుగా ఉందన్నారు. రాయలసీమకు నీరు తీసుకురావడానికి హంద్రీనీవా కాలువకు మరమ్మతులు చేస్తున్నట్లు వివరించారు. గతంలో గండికోట ప్రాజెక్టు నుంచి సాగు, తాగునీరు తీసుకు వస్తున్నట్లు అసత్య ప్రచారం చేసిన ఘనత వైసీపీ నాయకులకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో హంద్రీనీవా కాల్వ వెడల్పు పేరుతో బిల్లు చేసుకున్నారన్నారు. సమావేశంలో మధుసూదన్‌రాయల్, మైనార్టీ నాయకులు నూర్, ఫరుఖా పాల్గొన్నారు.

లింగ సమానత్వంపై వ్యాసరచన పోటీలు



శాంతిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తుమ్మిసీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం లింగ సమానత్వంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. రాళ్లబూదుగూరు ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో ఇవి జరిగాయి. మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ఎస్ఐ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

భూమి తిరిగి ఇప్పించాలని మహిళ వినతి

చౌడేపల్లె, మార్చి3(ఆంధ్రజ్యోతి): తన పట్టా భూమిని తిరిగి ఇప్పించాలని పలగార్లపల్లెకు చెందిన దళిత మహిళ బోయకొండమ్మ కోరింది. సోమవారం ఆమె ఎంఆర్‌పీఎస్ నాయకులతో కలసి తహసీల్దార్ హనుమంతుకు వినతిపత్రం అందజేసింది. ఆమె వివరాల మేరకు 2006లో రెవెన్యూ అధికారులు 2.18 సెంట్ల భూమి ఇచ్చారు. తాను తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వలేదని ఒకరు పొలం తమదే అంటున్నారని వాపోయింది. వడ్డీతో సహా తిరిగి ఇస్తానంటున్నా పొలం స్వాధీనం చేయడంలేదని ఎంఆర్‌పీఎస్ నాయకులు తహసీల్దారుకు చెప్పారు.

23న తిరుపతిలో మాలల సింహ గర్జన

బంగారుపాళ్యం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్‌కు వ్యతిరేకంగా ఈనెల 23వ తేదీన తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ స్కూల్ గ్రౌండ్‌లో మాలల సింహగర్జన జరగనుంది. ఈ మేరకు మాలల జేఏసీ అధ్యక్షుడు యమలా సుదర్శన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అంతకుముందు ప్రభుత్వ కళాశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. వర్గీకరణ చేయరాదని నినాదాలు చేశారు. నాయకులు ధనశేఖర్, పూతలపట్టు ప్రభాకర్, యమలా చంద్రయ్య, రాజశేఖర్, కృష్ణయ్యపాల్గొన్నారు.

పాడి, ఉద్యాన రంగాలకు రుణాలివ్వండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలోపాడి, ఉద్యానరంగాల ద్వారా అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలివ్వండి' అని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ మెగా ఔట్‌రీచ్ కార్యక్రమం జరగ్గా, ముఖ్యఅతిథులుగా కలెక్టర్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, బ్యాంకు ఎండీ మణిమేఘలై పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. సిబిల్ స్కోర్ ఆధారంగా అర్హులకు తక్కువగా రుణాలు ఇస్తున్నట్లు ఫిర్యాదులందాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కులను పంపిణీ చేశారు. యూనియన్ బ్యాంకు జనరల్ మేనేజర్ భాస్కర్‌రావు, అధికారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

రేపు నగరి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నగరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్, అమెజాన్ వేర్ హౌస్ కంపెనీలు సంయుక్తంగా బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నాయి. ఈ మేరకు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. టెన్త్ నుంచి డిగ్రీవరకు పాస్/ఫెయిలైన 18-35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైతే నెల జీతం రూ.18-21 వేల వరకు ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు 96007 84605, 95731 04593 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



రొంపిచెర్ల,మార్చి 3 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని కట్టకిద్ద సిద్ధేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, పార్వతీదేవి అమ్మవార్లకు పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు అర్చకులు మునిరాజ శర్మ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

స్వచ్ఛందంగా పారిశుధ్య పనులు



సోమల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్వయంభేశ్వరస్వామి ఆలయం వద్ద పారిశుధ్య పనులు జోరుగా జరుగుతున్నాయి. సోమవారం ఆలయ పరిసరాల్లో చెత్తకుప్ప నిల్వలను తొలగించారు. దాతలు ముందుకు వచ్చి ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి చెత్త కుప్పలను తొలగించారు. ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న శివపార్వతుల కల్యాణ మండపం వద్ద దారిలో చెత్తను తరలించారు. ఆమార్గంలో సిమెంట్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ ధర్మకర్త బీవీ సోమశేఖర్, అర్చకులు విద్యాసాగర్, రామసిద్దులు, లింగయ్య పాల్గొన్నారు.

బీసీవై యువదళం జయప్రదం చేయండి

పుంగనూరు, మార్చి3(ఆంధ్రజ్యోతి): ఈనెల 6న విజయవాడలోని ఎన్టీఆర్ కాలనీలో జరిగే బీసీవై యువదళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలోని యువతకు పార్టీని ప్రజలల్లోకి ఎలా తీసుకెళ్లాలనే అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్రంలోని బీసీవై యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

శాంతిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శివరామపురం పంచాయతీ గుట్టూరులో అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త చిన్నతంబి కుటుంబానికి పార్టీ నేతలు ఆర్థిక సహాయం చేశారు. సోమవారం మాజీ ఎంపీపీ పుష్పానారాయణస్వామి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, స్థానిక నేతలతో కలిసి మృతదేహాన్ని సందర్శించారు. పార్టీ తరపున మృతుడి కుటుంబానికి రూ.10 వేలు సాయం అందించారు. టీడీపీ నేతలు ఆర్ఎస్ మణి, సుబ్రహ్మణ్యం, సదానంద లోకేష్, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

చిత్తూరు అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని తాలూకా పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. సోమవారం మురకంబట్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. తిరుపతి వైపు నుంచి చిత్తూరు వైపు 14 టైర్ల భారీ లారీ వస్తోంది. ఆ వాహనాన్ని ఆపేసరికి లారీ డ్రైవర్ వంశీకృష్ణ పరారవడానికి ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం లారీని పరిశీలించగా ఇసుక ఉన్నట్లు గుర్తించారు. నెల్లూరు జిల్లా చింతవరం గ్రామానికి సమీపంలో ఉన్న సముద్రపు ఒడ్డు నుంచి ఇసుకను చెన్నైకి తరలిస్తున్నట్లు డ్రైవర్ విచారణలో తెలిపాడు.

మద్యం విక్రేత అరెస్టు

బంగారుపాళ్యం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం ఉదయం అరెస్టు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. బంగారుపాళ్యంకు చెందిన కృష్ణమనాయుడు మండల కేంద్రంలోని దుకాణాల వద్ద మద్యం అమ్ముతున్నాడని సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు నిఘా పెట్టి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి మన రాష్ట్రానికి చెందిన 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మొగిలీశ్వరుడి హుండీ ఆదాయం రూ.1.36 లక్షలు

బంగారుపాళ్యం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మొగిలిలోని మొగిలీశ్వరస్వామి వారి ఆలయానికి రూ.1,36,396 ఆదాయం వచ్చిందని ఈవో మునిరాజ, ధర్మకర్త ఎంబీ విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుమన్‌ప్రియ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగిందన్నారు.

విద్యార్థినులు ఆత్మరక్షణ నైపుణ్యం పెంచుకోవాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు సెంట్రల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఆత్మరక్షణ నైపుణ్యం పెంచుకోవాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ సూచించారు. సోమవారం ఓటీకే రోడ్డులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయలో రూపేష్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సొసైటీ ద్వారా జిల్లా వ్యాప్తంగా 513 ఎంపీపీ, ప్రాథమికోన్నత, ఉన్నత, జడ్పీ, కేజీబీవీ, మోడల్‌స్కూల్, మున్సిపల్, వెల్ఫేర్ స్కూల్స్, కళాశాలల్లో 6 నుంచి 9వ తరగతుల్లోని 33,620 బాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. సొసైటీ ఎండీ రూపేష్, మాస్టర్లు దివ్య, హేమంత్, ప్రిన్సిపాల్, పీడీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి రూ.లక్ష విరాళం



ఐరాల (కాణిపాకం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి రూ.50,116, గో సంరక్షణ ట్రస్టుకు రూ.50,116లను చిత్తూరుకు చెందిన దీక్షిత్ అనుదీప్ సోమవారం విరాళంగా అందించారు. దాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సమస్యల పరిష్కారం: కమిషనర్



బాధితుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎ‌స్)కు వచ్చే సమస్యలను వేగంగా పరిష్కరించాలని అధికారులను కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు ఎనిమిది అర్జీలు అందాయి. టౌన్‌ప్లానింగ్‌కు 4, ఇంజనీరింగ్‌కు 2, పింఛన్లకు 2 చొప్పున అర్జీలు ఉన్నాయి. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించినట్లు కమిషనర్ చెప్పారు. సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో లోకేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ కూరగాయలకు గిరాకీ



నగరిలో కూరగాయలను విక్రయిస్తున్న రైతులు - వెదురుకుప్పంలోని స్టాల్ వద్ద ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమార్

నగరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో పండించే కూరగాయలకు గిరాకీ పెరిగింది. వీటిని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రతి సోమవారం రైతులు విక్రయిస్తున్నారు. గంటలోపే కూరగాయలన్నీ అమ్ముడు పోతున్నాయని చెప్పారు.

వెదురుకుప్పం: ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలోనూ సేంద్రియ ఎరువులతో సాగు చేసిన కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను కార్వేటినగరం ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమార్ పరిశీలించారు. వారి వెంట ఎంఐఎస్ కో-ఆర్డినేటరు రేఖ ఉన్నారు.

వినికిడి సమస్యలపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో సుధారాణి, సిబ్బంది

చిత్తూరు రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని డీఎంహెచ్‌వో సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. వినికిడి సమస్యలపై అధికారులు, సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దూరాభారమైన పరీక్ష కేంద్రంతో ఇబ్బందులు



బస్ సౌకర్యం కల్పించాలని కోరుతున్న విద్యార్థులు

రొంపిచెర్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రం నుంచి ఇంటర్ పరీక్ష కేంద్రానికి వెళ్లడానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కస్తూరిబా విద్యాలయంలో 36 మంది, ఆదర్శ పాఠశాలలో 61 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. గతంలో చిన్నగొట్టిగల్లులో పరీక్ష కేంద్రం ఉండేది. జిల్లాల విభజనతో రొంపిచెర్ల ఇంటర్ విద్యార్థులకు పులిచెర్ల మండలం కొత్తపేటలో కేంద్రం ఏర్పాటు చేశారు. మండల కేంద్రం నుంచి ఇది సుమారు 18 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈమార్గంలో బస్సు సౌకర్యం లేదు. సొంత వాహనాల్లో, ఆటోల్లో కొందరు వెళ్తున్నారు. శనివారం తెలుగు పరీక్ష రాసి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తున్న ఆదర్శపాఠశాల ఇంటర్ విద్యార్థి భానుప్రకాష్ ఆటో ఢీకొని గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరీక్షలు పూర్తయ్యేవరకు బస్సు వసతి కల్పించాలని ఆదర్శ స్కూలు విద్యార్థులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే: టీడీపీ

గుడిపాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కార దిశగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పనిచేస్తున్నారని మాజీ జడ్పీటీసీ సుమతి, టీడీపీ నాయకుడు మురళీనాయుడు ప్రశంసించారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి అసెంబ్లీలో చర్చించడం, దానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం హర్షణీయమన్నారు. ఎంతోమంది ఎమ్మెల్యేలు చిత్తూరును పాలించినా.. తొలిసారిగా ఎమ్మెల్యే అయి ఉండి కూడా అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావించి అభివృద్ధికి చర్యలు చేపట్టడంలో జగన్మోహన్ ఆదర్శమన్నారు. ఇప్పటికే గుడిపాలలో రూ.20కోట్లతో తారురోడ్లు, సీసీరోడ్లు, గోకులం షెడ్లు, నిర్మాణపనులు జరగడం దీనికి నిదర్శనమన్నారు. ఇదంతా కూటమి ప్రభుత్వం ఏర్పడడంతోనే సాధ్యమన్నారు.

మల్లప్పకొండ హుండీ ఆదాయం రూ.3.44 లక్షలు

గుడుపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా స్వర్ణగిరి క్షేత్రమైన మల్లప్ప మల్లేశ్వరుడి ఆలయానికి రూ.3,34150 మేర హుండీ ఆదాయం లభించింది. మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహించారు.. సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. హుండీ, అభిషేకం, ఉత్సవం, అంగళ్ల గేటు ద్వారా ఈమేరకు ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

నగరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్, అమెజాన్ వేర్‌హౌస్ కంపెనీలు సంయుక్తంగా బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నాయి. ఈ మేరకు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. టెన్త్ నుంచి డిగ్రీవరకు పాస్/ఫెయిలైన 18-35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైతే నెల జీతం రూ.18-21 వేల వరకు ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు 96007 84605, 95731 04593 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆకతాయిల నుంచి విద్యార్థినులను కాపాడండి

- పోలీసులకు బొమ్మసముద్రం హైస్కూల్ హెచ్‌ఎం ఫిర్యాదు



సీఐకి సమస్యల తెలియజేస్తున్న హెచ్‌ఎం విజయలక్ష్మి

గుడిపాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిల నుంచి తమ విద్యార్థినులను కాపాడాలని పోలీసులను బొమ్మసముద్రం హైస్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ నాగరాజ యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం వెస్ట్ సీఐ శ్రీధర్, ఎస్‌ఐ రామ్మోహన్‌లకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల తనిఖీకి వచ్చిన పోలీసులకు తమ సమస్యను తెలియజేశారు. ఆకతాయిల కారణంగా కళాశాలకు వచ్చేందుకు విద్యార్థినులు భయపడుతున్నారని వాపోయారు. స్పందించిన సీఐ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆకతాయిల ఆటకట్టిస్తామని హామీ ఇచ్చారు.

మా గ్రామంలో మద్యం దుకాణం పెట్టొద్దు

నిర్వాహకులతో బలిజకండ్రిగవాసుల వాగ్వాదం - మూతపడిన షాపు



మూతపడ్డ మద్యం దుకాణం

పాలసముద్రం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజకండ్రిగలో ఆదివారం అర్ధరాత్రి మద్యం దుకాణాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం దుకాణాన్ని తెరవడంతో తమ గ్రామంలో వద్దని, దూరంగా ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు గ్రామస్తులు విన్నవించారు. అయితే తమకు లైసెన్స్ వచ్చిందని, ఇక్కడే మద్యం దుకాణాన్ని తెరుస్తామని వారు చెప్పారు. దీంతో గ్రామస్తులకు, నిర్వాహకులకు మధ్య మాటామాటా పెరిగింది. ఆగ్రహించిన గ్రామస్తులు ఆ మద్యం దుకాణానికి తాళం వేయాలని పట్టుబట్టారు. దీనిపై పాలసముద్రం ఎస్‌ఐ చిన్నరెడ్డెప్పకు కూడా ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి గ్రామస్తులతో చర్చించారు. తమిళనాడు రాష్ట్రం షోలింగ్ నుంచి పళ్లిపట్టుకు వెళ్లే జాతీయ రహదారి పక్కన దుకాణం ఏర్పాటు చేయడం సరికాదని గ్రామస్తులు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఐదు వందల మీటర్ల దూరంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. జాతీయ రహదారి పక్కన మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడానికి ఎక్సైజ్ అధికారులు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. దీంతో ఇరు వర్గాలకు పోలీసులు నచ్చచెప్పారు. జాతీయ రహదారి పక్కన కాకుండా, గ్రామానికి దూరంగా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సచించారు. చివరకు మద్యం దుకాణమైతే మూతపడింది.

అర్బన్ డివిజన్ కార్యాలయంలో ఎస్‌ఈ తనిఖీలు



డివిజన్ కార్యాలయం వద్ద ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తదితరులు

చిత్తూరు రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గాంధీరోడ్డులోని విద్యుత్ శాఖ చిత్తూరు అర్బన్ డివిజన్ కార్యాలయాన్ని ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ సోమవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అకౌంట్స్ సెక్షన్ భవనం మరమ్మతులకు గురైందని, కొత్తది నిర్మించాలని అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నిర్మాణానికి కావాల్సి చర్యలు ప్రారంభించాలని ఎస్‌ఈ ఆదేశించారు. ఈఈ మునిచంద్ర, డీఈలు ఆనంద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ పాలసీదారులకు, ఏజెంట్లకు న్యాయం చేయండి



ఎంపీ ప్రసాదరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు

చిత్తూరు సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీ పాలసీదారులకు, ఏజెంట్లకు న్యాయం జరిగేలా చూడాలని ఎల్‌ఐసీ నెల్లూరు డివిజన్ నేతలు కోరారు. సోమవారం లక్ష్మీనగర్ కాలనీలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును కలసి వినతి పత్రం సమర్పించారు. దేశంలోని ఏజెంట్లందరూ ఈనెల 19వ తేదీన ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో శాంతియుత మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎల్‌ఐసీ నెల్లూరు డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్, సెక్రటరీ డీవీ గిరి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు



ట్రోఫీతో పెరుమాళ్లపల్లె రాకర్స్ జట్టు సభ్యులు

యాదమరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శివరాత్రిని పురస్కరించుకుని పెరుమాళ్లపల్లె గ్రామంలో జరిగిన క్రికెట్ టోర్నీ సోమవారంతో ముగిసింది. ఫైనల్స్‌లో పాతపాళ్యం కృష్ణ జట్టుపై పెరుమాళ్లపల్లె రాకర్స్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.11,999, రన్నర్స్‌కు రూ.6499, మూడో స్థానంలో నిలిచిన దాసరాపల్లి జట్టుకు రూ.3499 బహుమతులను గ్రామపెద్ద చంద్రశేఖర్ రెడ్డి, రాజారెడ్డి, మనోహర్ రెడ్డి అందజేశారు. యూత్ సభ్యులు పాల్గొన్నారు.

23న మాలల సింహ గర్జన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

బంగారుపాళ్యం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్‌కు వ్యతిరేకంగా ఈనెల 23వ తేదీన తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ స్కూల్ గ్రౌండ్‌లో మాలల సింహ గర్జన జరగనుంది. ఈ మేరకు మాలల జేఏసీ అధ్యక్షుడు యమలా సుదర్శన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అంతకుముందు ప్రభుత్వ కళాశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. వర్గీకరణ చేయరాదని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనశేఖర్, పూతలపట్టు ప్రభాకర్, యమలా చంద్రయ్య, రాజశేఖర్, కృష్ణయ్య, రెడ్డెప్ప, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతో ఇరువర్గాల ఘర్షణ

- ఇద్దరికి తీవ్రగాయాలు

చిత్తూరు అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనపై ఒకటి, రెండో పట్టణ పోలీసు స్టేషన్లలో వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి. సీబీరోడ్డుకు చెందిన లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. సీబీరోడ్డులో ఉంటున్న లలిత చెల్లెల కొడుకు మోహన్‌కు, చామంతిపురానికి చెందిన పాండ్యన్‌కు పాతకక్షలున్నాయి. సోమవారం పాండ్యన్, అతడి స్నేహితుడు శరవణ కలిసి మోహన్, ఆయన తల్లి, పెద్దమ్మ అయిన లలితపై కత్తులు, రాడ్లతో దాడి చేశారు. అనంతరం మోహన్ బంధువులు కలిసి పాండ్యన్, అతడి బంధువులపై కత్తులతో దాడి చేశారు. ఈ ఘర్షణలో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు సమాచారం.

ద్విచక్రవాహనం చోరీ



చిత్తూరు అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): దుకాణం ముందు పెట్టిన ద్విచక్రవాహనం చోరీ కావడంపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. గుర్రప్పనాయుడు వీధికి చెందిన రేణుకకు ప్రొవిజన్ షాపు ఉంది. తన ద్విచక్ర వాహనాన్ని దుకాణం ముందు పార్కు చేశారు. షాపులో పనులయ్యాక మధ్యాహ్నం బయటకు వచ్చేసరికి వాహనం కనపడలేదు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీ సీజ్

చిత్తూరు అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని తాలూకా పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. సోమవారం మురకంబట్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. తిరుపతి వైపు నుంచి చిత్తూరు వైపు 14 టైర్ల భారీ లారీ వస్తోంది. ఆ వాహనాన్ని ఆపేసరికి లారీ డ్రైవర్ వంశీకృష్ణ పరారవడానికి ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం లారీని పరిశీలించగా ఇసుక ఉన్నట్లు గుర్తించారు. నెల్లూరు జిల్లా చింతవరం గ్రామానికి సమీపంలో ఉన్న సముద్రపు ఒడ్డు నుంచి ఇసుకను చెన్నైకి తరలిస్తున్నట్లు డ్రైవర్ విచారణలో తెలిపాడు. అలాగే చింతవరానికి చెందిన మహేష్‌రెడ్డి ఆదేశాలతోనే తరలించినట్లు చెప్పడంతో వారిద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

మద్యం విక్రేత అరెస్టు

బంగారుపాళ్యం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం ఉదయం అరెస్టు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. బంగారుపాళ్యంకు చెందిన కృష్ణమనాయుడు మండల కేంద్రంలోని దుకాణాల వద్ద మద్యం అమ్ముతున్నాడని సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు నిఘా పెట్టి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి మన రాష్ట్రానికి చెందిన 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పేటపల్లెలో పేడదిబ్బలపై రగడ

పూతలపట్టు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పేటపల్లె గ్రామంలో పేడదిబ్బలపై స్థానికుల మధ్య నిత్యం రగడ జరుగుతోంది. గ్రామంలో సుమారు 40 కుటుంబాలకు పైగా నివాసముంటున్నారు. గ్రామంలోని కొందరు ఇళ్ల మధ్య, రోడ్డు పక్కన ఎక్కడపడితే అక్కడ పేడదిబ్బలు వేశారు. దీనికారణంగా దుర్గంధానికి తోడు జనం అంటురోగాల బారిన పడుతున్నారు. వీటిని తొలగించాలని పంచాయతీ అధికారులు చెబుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు ఈ పేడదిబ్బల కారణంగా తరచూ గొడవలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా మండలస్థాయి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు-తిరుపతి మార్గంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పుంగనూరు పట్టణానికి చెందిన మొగిలీశ్వర్, రవిలు చౌడేపల్లె మండలం చింతమాకులపల్లెలో మేస్త్రి పని చేసుకుని ఇంటికి వెళుతుండగా గొల్లపల్లె సమీపంలో వెనకవైపునుంచి వాహనం ఢీకొంది. ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. బాధితులను 108 సిబ్బంది పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇరువర్గాల ఘర్షణ : ఐదుగురికి గాయాలు

పుంగనూరు రూరల్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల ఘర్షణలో పలువురు గాయపడ్డారు. వివరాలిలా.. చౌడేపల్లె మండలం కెతనపల్లెకు చెందిన రాజేంద్ర ప్రవర్తనపై భాగ్యమ్మ గ్రామ పెద్దలకు ఫిర్యాదుచేసింది. దీంతో వారు పంచాయతీ నిర్వహించి రాజేంద్రను మందలించారు. రాజేంద్ర బంధువులైన గాండ్లపల్లె వాసులు వెంకటాచలపతి, శ్రీనివాసులు ఈ పంచాయతీకి వచ్చారు. బయటవారు రావద్దని గ్రామస్తులు చెప్పారు. దీంతో వారిద్దరూ వెళ్లిపోయారు. ఈ క్రమంలో సోమవారం భాగ్యమ అక్క కుమారుడు బాలసుబ్రహ్మణ్యం చారాలకు వెళుతుండగా వెంకటాచలపతి, శ్రీనివాసులు దాడి చేసి గాయపరిచారు. దీంతో ఇరువర్గాలూ ఘర్షణ పడ్డారు. గంగులమ్మ, ఆమె భర్తహరీష్‌లు తీవ్రంగా, శ్రీనివాసులు, వెంకటాచలపతిలు స్వల్పంగా గాయపడ్డారు. వీరంతా పుంగనూరులో చికిత్స పొందుతున్నారు.

కొనసాగుతున్న మహిళా సాధికారత వారోత్సవాలు



పెనుమూరు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

చిత్తూరు అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఈనెల 8వతేదీవరకు మహిళా సాధికారతపై వారోత్సవాలను నిర్వహిస్తోంది. సోమవారం అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోని పాఠశాలల్లో జెండర్ ఈ క్వాలిటీపై వ్యాసరచన పోటీలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అలాగే అన్ని పోలీసుస్టేషన్లలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. మహిళా పోలీసులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వైద్య సూచనలను అందించారు. పాఠశాలల్లో ఓపెన్ హౌస్‌ను నిర్వహించి.. పోలీసు వ్యవస్థపై, ఈవ్‌టీజింగ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సైబర్‌నేరాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బంగారుపాళ్యం: సామాజిక ఆరోగ్య కేంద్రంలో మహిళా పోలీసులకు డాక్టర్ విజయకుమారి, డాక్టర్ షాలిని వైద్య పరీక్షలు నిర్వహించారు. సీఐ కత్తి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమూరు: జడ్పీ హైస్కూల్లో లింగసమానత్వంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం యామిని, హెడ్ కానిస్టేబుల్ మధు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

7న వరసిద్ధుడి హుండీ లెక్కింపు

ఐరాల(కాణిపాకం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీని ఈనెల 7న లెక్కించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం స్వామి కానుకలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. లెక్కింపు సందర్భంగా ఆలయ ఉద్యోగులు ఎవ్వరూ సెలవు పెట్టరాదన్నారు.

కిడ్నీ వ్యాధులపై వైద్యశిబిరం

గుడిపాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): 190 రామాపురం సీఎంసీలో ఈనెల 8వ తేదీన వైద్య శిబిరం జరుగుతుందని పీఆర్వో ప్రిన్స్, డైరెక్టర్లు తెలిపారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. కిడ్నీవ్యాధులున్న వారికి అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించి.. ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటలవరకు శిబిరం నిర్వహిస్తారన్నారు.

మొగిలీశ్వరుడి హుండీ ఆదాయం రూ.1.36 లక్షలు

బంగారుపాళ్యం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మొగిలి గ్రామంలోని కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వారి ఆలయానికి రూ.1,36,396 ఆదాయం వచ్చిందని ఈవో మునిరాజ, ధర్మకర్త ఎంటీ విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుమన్‌ప్రియ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగిందన్నారు. ఈ ఆదాయం పూర్తిగా రథోత్సవం జరిగిన ఒక్క రోజుకు సంబంధించినదేనని పేర్కొన్నారు.

పాడి, ఉద్యాన రంగాలకు రుణాలివ్వండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలోపాడి, ఉద్యానరంగాల ద్వారా అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలివ్వండి' అని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ మెగా ఔట్‌రీచ్ కార్యక్రమం జరగ్గా, ముఖ్యఅతిథులుగా కలెక్టర్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, బ్యాంకు ఎండీ మణిమేఘలై పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. సిబిల్ స్కోర్ ఆధారంగా అర్హులకు తక్కువగా రుణాలు ఇస్తున్నట్లు ఫిర్యాదులందాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కులను పంపిణీ చేశారు. యూనియన్ బ్యాంకు జనరల్ మేనేజర్ భాస్కర్‌రావు, అధికారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

యాచకుడి మృతదేహానికి అంత్యక్రియలు

వి.కోట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వి.కోట పట్టణంలో గుర్తుతెలియని యాచకుడు మృతి చెందాడు. అన్నదాన సేవా సమితి వేణు అక్కడకు చేరుకుని పంచాయతీ వారికి సమాచారం ఇచ్చారు. వారితో కలసి యాచకుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. మృతుడి వివరాలు తెలియలేదని వేణు చెప్పారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

శాంతిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శివరామపురం పంచాయతీ గుట్టూరులో అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త చిన్నతంబి కుటుంబానికి పార్టీ నేతలు ఆర్థిక సహాయం చేశారు. మాజీ ఎంపీపీ పుష్పానారాయణస్వామి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, స్థానిక నేతలతో కలిసి మృతదేహాన్ని సందర్శించారు. పార్టీ తరఫున మృతుడి కుటుంబానికి రూ.10వేల సాయం అందించారు. టీడీపీ నేతలు ఆర్ఎస్ మణి, సుబ్రహ్మణ్యం, సదానంద లోకేష్, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు కట్టినా ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడం లేదు

సమస్య పరిష్కరించాలని కూటమి నేతలకు రైతుల వినతి

పుంగనూరు రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలని రైతులు కోరారు. విద్యుత్ స్తంభాలకు వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రెండేళ్ల క్రితం విద్యుత్‌శాఖకు డీడీల ద్వారా కొంతమొత్తం చెల్లించామని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, జనసేన నాయకుడు చైతన్యరాయల్, బీజేపీ నాయకుడు నానబాల కుమార్‌లకు రైతులు చెప్పారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయిందన్నారు. గత ప్రభుత్వం రైతులను రోడ్డున పడేసిందన్నారు. వేసవిలో వాణిజ్య పంటల సాగుకు వీలుగా విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు త్వరగా ఇప్పించాలని రైతులు విన్నవించారు.